సాక్షి నిర్మల్

శుక్రవారం ∣ 13 ∣ సెప్టెంబర్ ∣ 2024



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

బాలికలపై వేధింపులు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో వారి ఆత్మరక్షణకు సర్కారు బడుల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. 8లో▸

మానసిక అనారోగ్యంతో ఆత్మహత్యలు

ఖానాపూర్: మానసిక అనారోగ్యం కారణంగానే యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సురేశ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఆత్మహత్యల నివారణ' అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గించుకోవడానికి వైద్యులు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
31.1 /23.6

వాతావరణం

ఆకాశం దాదాపుగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఒకటి రెండుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కడెం కేజీబీవీకి ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్‌వో విమల

కడెం: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలను ఉత్తమ పురస్కారం వరించింది. 2003–24 ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలల ప్రిన్సిపాళ్లకు హైదరాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డి చేతుల మీదుగా కడెం కేజీబీవీ ఎస్‌వో విమల ప్రశంసాపత్రం అందుకున్నారు.

పండుగలు సంస్కృతిలో భాగం



బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: పండుగలు భారతీయ సంస్కృతిలో భాగమని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏఎస్పీ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రాజారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్, రామకృష్ణగౌడ్, డాక్టర్ నాగేశ్, దత్తాత్రి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

పంచాయతీ ట్యాంకర్ లాక్కెళ్లిన తయారీదారు!



చాక్‌పల్లిలో వెంకూర్ పంచాయతీ ట్యాంకర్

కుంటాల: పంచాయతీ వాటర్ ట్యాంకర్ డబ్బులు చెల్లించడం లేదని తయారు చేసిన యజమాని మండలంలోకి కొత్తవేంకూర్ వాటర్ ట్యాంకర్‌ను తీసుకెళ్లాడు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలు ట్రాక్టర్‌తోపాటు వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2023 నవంబర్‌లో నర్సాపూర్ (జి) మండలంలోని చాక్‌పల్లిలో రూ.1.50 లక్షలకు ట్యాంకర్ కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.20 వేలు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.1.30 లక్షలు చెల్లించకపోవడంతో తయారీదారుడు గురువారం ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఈవిషయమై ఎంపీవో రహీంను సంప్రదించగా, వాటర్ ట్యాంకర్ యజమానికి బకాయి ఉన్నమాట వాస్తవమే అన్నారు. నిధులు విడుదల కాగానే డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

నూనెగింజల సాగుపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని చందునాయక్ తండాలో హైదరాబాద్ సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా నూనెగింజల సాగుపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు సాగులో మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఫౌండేషన్ అందిస్తున్న సేవలను వివరించారు. నువ్వు పంట సాగుపై అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ నూనె గింజల పరిశోధనా సంస్థ నిర్వాహకులతోపాటు రైతులు హేమ్లానాయక్, రాములునాయక్, బాలానాయక్, గణేశ్, నవీన్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.విలాస్ కోరారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాలకు జిల్లాలో పత్తి, సోయా, వరి, మొక్కజొన్న పంటలు ఎత్తున దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌ఎన్.రెడ్డి, బూక్య రమేశ్, నాయకులు కైలాశ్, దుర్గం అనంత్ పాల్గొన్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో..!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత
- జిల్లా వ్యాప్తంగా 54 టీచర్, 284 ఆయా పోస్టులు ఖాళీ
- పక్క కేంద్రాల టీచర్లకు అదనపు బాధ్యతలు
- సేవలు సక్రమంగా పొందలేకపోతున్న గర్భిణులు, బాలింతలు



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు బోధిస్తున్న టీచర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతోంది. దీంతో కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయి.

టీచర్లు, హెల్పర్లది కీలకపాత్ర..

ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లది క్షేత్రస్థాయిలో చాలా కీలకపాత్ర. ఒకవైపు సొంత అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించుకోవాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు పలురకాల సేవలు అందించాలి. వైద్యారోగ్య శాఖ కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి. చివరకు ఎన్నికల విధుల్లో క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులుగా సేవలందించాలి. ఇన్నిరకాల విధుల్లో తలమునలవుతున్న వీరిపై ఈ ఖాళీల కారణంగా ఇంకా అదనపు పనిభారం పడుతోంది. ఖాళీలు భర్తీ అయితే వీరికి పనిభారం తగ్గడంతోపాటు మెరుగైన సేవలూ అందే అవకాశం ఉంటుంది.

వెక్కిరిస్తున్న ఖాళీలు..

జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలోని 4 ప్రాజెక్టుల పరిధిలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. భైంసా, ఖానాపూర్, ముధోల్, నిర్మల్ ప్రాజెక్టుల పరిధిలో కలిపి 54 టీచర్ పోస్టులు, 284 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో టీచర్లు, ఆయాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్లలో సిబ్బంది కొరత ఏర్పడిన తర్వాత ఇన్‌చార్జీలను పెట్టి కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, సరైన రీతిలో పనితీరు లేదన్న విమర్శలున్నాయి.

ప్రాజెక్టుల వారీగా టీచర్ పోస్టుల వివరాలు

ప్రాజెక్టు	పోస్టులు	విధుల్లో ఉన్నవారు	ఖాళీలు
భైంసా	205	192	13
ఖానాపూర్	244	232	12
ముధోల్	180	173	7
నిర్మల్	297	275	22

ప్రాజెక్టుల వారీగా హెల్పర్ పోస్టుల వివరాలు

ప్రాజెక్టు	పోస్టులు	విధుల్లో ఉన్నవారు	ఖాళీలు
భైంసా	205	154	51
ఖానాపూర్	244	171	73
ముధోల్	180	120	60
నిర్మల్	297	197	100

జిల్లాలో 926 అంగన్వాడీ కేంద్రాలు..

జిల్లాలోని 18 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 926 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో ప్రస్తుతం గర్భిణులు 56,854 మంది, బాలింతలు 4,073 మంది ఉన్నారు. 6 నెలలలోపు చిన్నారులు 4,265 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 30,560 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 27,919 మంది ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య(ఈసీసీ)పై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. ఇప్పటికే వారికి శిక్షణ పూర్తి చేశారు.

మహిళా అభ్యర్థుల్లో ఆశలు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించింది. దీంతో నిరుద్యోగులైన మహిళా అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని మండలాల వైద్యాధికారులు, సీహెచ్‌సీ వైద్యాధికారులు, పంచాయతీరాజ్ అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నమోదైన డెంగీ కేసులు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న ముందస్తు జాగ్రత్తలు, పీహెచ్‌సీలు, ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందులు, వ్యాధుల నియంత్రణకు ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాల గురించి ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యారోగ్య శాఖ పనితీరును మరింతగా పటిష్టపర్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రోజూ వారీగా నమోదవుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యాధుల నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గునియా రోగులకు చికిత్స అందించాలన్నారు. ఆస్పత్రుల వారీగా వైద్యుల హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఆస్పత్రుల్లోని ఆయా విభాగాలు, ఔషధాల నిల్వ, స్టోర్ రూమ్, రోగుల ఇన్ పేషంట్ వార్డు, ల్యాబ్ తదితర నమోదు రిజిస్టర్లను నిరంతరం పరిశీలించాలన్నారు. పాఠశాలలు, హాస్టళ్లను ఎంపీడీవోలు, మండల వైద్యాధికారులు నిరంతరం సందర్శించి, వ్యాధుల నియంత్రణ పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రక్తహీనత లోపం నివారించేందుకు గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఎంహెచ్‌వో రాజేందర్, జెడ్పీ సీఈవో గోవింద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, నిర్మల్, భైంసా మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేశ్‌కుమార్, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజర్ల భరతం పట్టిన ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎక్స్‌రోడ్ వద్ద విద్యార్థినులు ఆర్టీసీ బస్సు కోసం నిత్యం ఎదురుచూస్తూ ఉంటారు. అదే అదునుగా కొంతమంది పోకిరీలు అక్కడ అడ్డావేసి వేధిస్తున్నారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఎస్పీ జానకీషర్మిల గురువారం సాయంత్రం స్వయంగా రంగంలోకి దిగారు. ఎక్స్‌రోడ్ వద్దకు వచ్చి ఈవ్‌టీజర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



యువకులను పట్టుకున్న ఎస్పీ జానకీషర్మిల

ఆపద వేళ ఆమెకు భరోసా

- సత్వర సమాచారానికి మొబైల్ యాప్
- '112 ఇండియా' యాప్ మహిళలకు ఉపయుక్తం..



112 ఇండియా'యాప్ హోమ్ పేజీ

నిర్మల్‌ఖిల్లా: మహిళలపై అకృత్యాలు క్రమంగా పెరిగిపోతున్నాయి. ఒంటరి మహిళలు, యువతులపై దాడులు ఆగడం లేదు. ఇటీవల ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తువును డెలివరీ చేసేందుకు వచ్చిన బాయ్ ఒంటరిగా ఉన్న గృహిణిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలోనే జరిగింది. ఇదే కాకుండా సాయంత్రంవేళ కూడా ఒంటరిగా కనిపిస్తున్న మహిళల మెడలోని బంగారు గొలుసు దొంగతనాలు వంటి ఘటనలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మహిళలు, యువతులు అనుకోని ఆపదలో, అత్యవసర సమయంలో దీనిని వినియోగించుకోవచ్చు. డయల్ 100 తరహాలోనే పనిచేసే ఈ నంబరు వినియోగంపై చాలామందికి పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో '112 ఇండియా' యాప్‌ను కూడా రూపొందించింది.

ఇలా పనిచేస్తుంది..

మొబైల్ ప్లే స్టోర్ ద్వారా112 ఇండియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత రాష్ట్రం పేరు, మొబైల్ నంబరు నమోదు చేసుకుని కనెక్ట్ అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. అనంతరం రిజిస్టర్డ్ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నంబరును వెరిఫై చేసి న తర్వాత క్లిక్ చేసి లొకేషన్ గుర్తించాల్సి ఉంటుంది. పేజీ తెరుచుకున్న తర్వాత అందులో పోలీస్, ఫైర్, మెడికల్, వరద, రైల్వే ఇలా పలు ఆప్షన్స్ కనిపిస్తాయి. అవసరమైన దాన్ని తెరిచి అత్యవస ర సమయంలో వివరాలను నమోదు చేస్తే ఆ లొ కేషన్ ఆధారంగా సమీపంలోని పోలీస్ స్టేషనుకు అనుసంధానం జరుగుతుంది. దాని ఆధారంగా సత్వరమే పోలీసులు అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని సంరక్షించే అవకాశం ఉంటుంది.

ప్రశాంత నిమజ్జనానికి సహకరించాలి

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల, చిత్రంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాబీర్‌అహ్మద్

భైంసాటౌన్: భైంసాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ జానకీషర్మిల కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ముస్లిం మత పెద్దలు, మసీదు నిర్వాహకులతో గురువారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. సమస్యలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. డీజే శబ్దాలతో ఇబ్బంది ఏర్పడకుండా, తమవర్గం మనోభావాలు దెబ్బతినేలా ఎదుటివర్గం వ్యవహరించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. గతంలో నెలకొన్న ఘటనల నేపథ్యంలో భైంసా పట్టణంలో వినాయక నిమజ్జనంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉందన్నారు. భైంసాపై ఉన్న చెడ్డపేరు తొలిగేలా ఉత్సవాలు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు నమ్మొద్దని, యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. భైంసా యువత కోసం స్థానికంగా లైబ్రరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నా రు. ఏఎస్పీ అవినాష్‌కుమార్ మాట్లాడుతూ.. పండుగలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.జాబీర్ అహ్మద్, సీఐ రాజారెడ్డి, ఆర్డీవో కోమల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నిమజ్జన ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ముఫ్తీ అబ్దుల్ ఘని, మౌలానా షాహిద్, హఫీజ్ అబ్దుల్ లతీఫ్, మసీద్ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముధోల్‌లో ఏర్పాట్లు పరిశీలన

ముధోల్: ముధోల్ వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ జానకీషర్మిల గురువారం పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు అందజేశారు. ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినాయక శోభాయాత్ర మార్గంలో పర్యటించి సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీని వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

అక్రమాల పర్వం..!



- క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యం
- స్టాంపింగ్ ఆదాయానికి గండి
- ఇన్‌చార్జి బాధ్యతలతో పర్యవేక్షణ కరువు

- లోకేశ్వరం మండల కేంద్రంలో కొద్దినెలల క్రితం తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, జగిత్యాలకు చెందిన ఓ ప్రైవేట్ కాంటా మెకానిక్‌తో కలిసి ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ కోసం డబ్బులు వసూలు చేశారు. కానీ, కాంటాలకు స్టాంపింగ్ చేయలేదు. వాస్తవానికి జిల్లా అధికారి సమక్షంలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలి.
- ఇటీవల ముధోల్ మండలకేంద్రంలోనూ తూనికలు, కొలతల శాఖ సిబ్బంది, జగిత్యాలకు చెందిన ప్రైవేట్ కాంటా మెకానిక్‌తో కలిసి ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ కోసం వచ్చినట్లు తెలిసింది. ఇక్కడా, జిల్లా అధికారి లేకుండానే స్టాంపింగ్ చేశారు. వాస్తవానికి కాంటా పరిశీలించి, అధికారి సమక్షంలో కాంటాకు సీలు వేయాలి.

భైంసాటౌన్: జిల్లా తూనికలు, కొలతల శాఖలో అక్రమాల పర్వానికి అడ్డుకట్ట పడడం లేదు. కార్యాలయ సిబ్బంది కాంటా మెకానిక్‌లతో కుమ్మక్కై ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన ఓ కాంటా మెకానిక్‌తో పొసగక, జగిత్యాలకు చెందిన మరో కాంటా మెకానిక్‌తో జిల్లాలో కాంటాలకు స్టాంపింగ్ చేయిస్తున్నారు. ఎవరు ఎక్కువ కమీషన్ ఇస్తే వారికే సహకరిస్తున్నారని, ఈ విషయమై జిల్లాకు చెందిన కాంటా మెకానిక్ ఇటీవల ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాను డబ్బులు ఇచ్చినా, తన వెంట రాకుండా, జగిత్యాలకు చెందిన కాంటా వ్యక్తితో స్టాంపింగ్ కోసం వెళ్తున్నారని పేర్కొన్నాడు. దీంతో ఉన్నతాధికారి ఇటీవల విచారణ చేపటినట్లు సమాచారం. ఇందులో శాఖ ఉద్యోగులు, కాంటా మెకానిక్‌లు కలిసి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్లు గుర్తించారని తెలిసింది.

ఇన్‌చార్జి బాధ్యతతో కరువైన పర్యవేక్షణ..

నిర్మల్, భైంసా పట్టణంలో వందలాది కిరాణ, వెండి, బంగారు వర్తక, ఇతర దుకాణాలు, పదుల సంఖ్యలో వేబ్రిడ్జిలు, పెట్రోల్ పంపులు ఉన్నాయి. ఖానాపూర్ పట్టణంలోనూ వందల సంఖ్యలోనే దుకాణా లున్నాయి. తూనికలు, కొలతల శాఖ నిబంధనల ప్రకారం.. వినియోగదారులకు కచ్చితమైన ప్రమాణాల్లో వస్తు సేవలు అందాలి. ఇందుకుగాను తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలు తనిఖీ చేసి, కాంటా మెకానిక్‌తో సరిచేయించి స్టాంపింగ్ వేయాలి. తద్వారా తూకాల్లో మోసాలకు తావు లేకుండా చూడాలి. అలాగే ప్రతీ వస్తుసేవల్లో నిర్ణీత ప్రమాణాలు పాటించేలా చూడాలి. కానీ, జిల్లాలో తూనికలు, కొలతల శాఖకు ఇన్‌చార్జి అధికారి బాధ్యతలతో వినియోగదారులకు సరైన వస్తుసేవలు అందడం లేదు. చాలా వరకు ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ లేకుండానే తూకాలు జరుగుతున్నాయి. రెగ్యులర్ అధికారి, సరిపడా సిబ్బంది లేక కాంటాల తనిఖీ, అక్రమాలపై పర్యవేక్షణ కొరవడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దుకాణదారుల వద్ద కాంటా స్టాంపింగ్ కోసం డబ్బులు వసూలు చేస్తూ, కొన్నింటికి మాత్రమే స్టాంపింగ్ వేసి, మిగిలిన డబ్బులు కాజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆదాయానికి గండి...

ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలు, వేబ్రిడ్జిలు, పెట్రోల్‌పంపులు, ఇతర తూకాలకు సంబంధించి స్టాంపింగ్ రూపంలో శాఖకు ఏటా రూ.లక్షల్లో ఆదాయం చేకూరాలి. కానీ, జిల్లాలో ఇన్‌చార్జి అధికారికి ఇతర జిల్లాల బాధ్యతల నేపథ్యంలో సకాలంలో స్టాంపింగ్ చేయకపోవడం, చాలావరకు కాంటాలకు స్టాంపింగ్ చేయకపోవడంతో శాఖకు భారీగా ఆదాయానికి గండి పడుతోంది. అధికారి పర్యవేక్షణ లేక కొందరు కాంటా మెకానిక్‌లు, ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు జిల్లాకు రెగ్యులర్ అధికారిని నియమించి, తూకాల్లో మోసాలపై పర్యవేక్షణ చేయాలని, వినియోగదారులకు నిజమైన సేవలందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇన్‌చార్జి బాధ్యతలతోనే...

"నిర్మల్ జిల్లాకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఇతర జిల్లాల బాధ్యతలు ఉండడంతో సిబ్బందిని కాంటాల స్టాంపింగ్ కోసం ఆదేశిస్తున్నాను. వారు పరిశీలించిన తరువాత మళ్లీ నేను వచ్చి స్టాంపింగ్ చేపిస్తున్నా. స్టాంపింగ్‌లో జాప్యం జరుగుతోంది. అక్రమాలకు తావు లేదు."

– భూలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జి అధికారి

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

నిర్మల్‌చైన్‌గేట్: రాజకీయ పరిపక్వత లేని నాయకుడు రాహుల్‌గాంధీ అని, మన దేశానికి ప్రతిపక్ష నేతగా ఆయన ఉండడం దురదృష్టకరమని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అమెరికా పర్యటన భారత దేశ వ్యతిరేక ప్రచార పర్యటనగా ఉందన్నారు. దేశ సంస్కృతి విషయంలో విషం చిమ్ముతూ దేశ అంతర్గత విషయాలపై అవగాహన లేని వ్యక్తి అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకివస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పి తప్పుడు ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ ఇప్పుడు రిజర్వేషన్ల మార్పు గురించి అమెరికాలో వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి రాహుల్ వ్యాఖ్యలతో వెల్లడైందని తెలిపారు. రిజర్వేషన్లు మార్చడం ఎవరితరం కాదని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆలోచన మేరకే బీజేపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచ కొండ సాగర్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు అయ్యన్నగారి రాజేందర్, నరేంద్రాచారి, కొండాజీ శ్రవణ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, నరేశ్, ఉపాధ్యక్షుడు దిలీప్, రాజు, ఆడెపు సుధాకర్, ఎంజీఆర్ పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన యువతి (27)అదృశ్యమైనట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ మదన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లినా ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాలింత మృతి


కావ్య(ఫైల్)

కాసిపేట: కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన బాలింత మృతి చెందగా, గురువారం అనుమానస్పద మృతిగా కేసు నమోదైంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కావ్య (26) 2019లో అదే గ్రామానికి చెందిన మూడేడ్ల సాయికిరణ్‌తో వివాహమైంది. ఈనెల 5న బెల్లంపల్లిలోని జనని హాస్పిటల్‌లో పాపకు జన్మనిచ్చి, 8న డిశ్చార్జ్ అయింది. 11న ఆరోగ్యం బాగాలేదని ఆమెను మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిపై అనుమానం ఉందని ఆమె సోదరుడు ఐలవేని సాయిరోహిత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెన్‌గంగలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జైనథ్: మండలంలోని డొల్లారా గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. మృతుడు తెలుపు రంగు బనియన్, తెలుపు రంగు ధోవతి ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 55 నుంచి 65 ఉండవచ్చునని, రెండు, మూడు రోజుల ముందు చనిపోయి ఉండవచ్చునని అన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 8712659916, 8712659929 నంబర్‌లో సమాచారం అందించాలని కోరారు.

పూల కోసం వెళ్లి..చెరువులో మునిగి ఒకరి మృతి


వివరాలు సేకరిస్తున్న ఎస్సై రమేశ్

బెల్లంపల్లిరూరల్: తామర పూలకోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒకరు మృతి చెందాడు. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పోతరాజుల నర్సయ్య (60) పోచమ్మ చెరువులో తామర పూలు సేకరించి బజారుఏరియాలో అమ్ముకుని మద్యం తాగాడు. రోజువారీగా బుధవారం సాయంత్రం నర్సయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలేదు. గురువారం పోచమ్మ చెరువులో నర్సయ్య మృతదేహం లభించింది. పూల కోసం చెరువులోకి వెళ్లగా నర్సయ్య కాళ్లకు నాచు చుట్టుకుని ఊపిరి ఆడక మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఘటనాస్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మందమర్రిరూరల్: పాత బస్టాండ్ ఏరియాలో పక్కా సమాచారంతో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఏడుగురితోపాటు ఇంటి యజమాని బోరిగం వెంకటేశ్వర్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,700 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జైపూర్: ఇందారం శివారులోని చామ కిరణ్‌కుమార్ రెడ్డి వెంచర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారంతో దాడి చేయగా ఐదుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.9,480 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల బైండోవర్

దండేపల్లి: మండలంలోని మాదాపూర్ శివారులో ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురిని గురువారం తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. మళ్లీ పేకాట ఆడితే కేసు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తామని ఎస్సై హెచ్చరించారు.

కరాటే శిక్షణ..బాలికలకు ఆత్మరక్షణ

- ప్రత్యేక శిక్షకులతో కరాటే తరగతులు
- స్వీయరక్షణకు ఎంతో దోహదం
- రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్‌లో పాఠశాలలు ఎంపిక

జిల్లాలవారీగా ఎంపికైన పాఠశాలలు

జిల్లా	పాఠశాలల సంఖ్య
నిర్మల్	141
ఆదిలాబాద్	163
మంచిర్యాల	130
కుమురం భీం	118
మొత్తం	552


కరాటేలో శిక్షణ పొందుతున్న బాలికలు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుత సమాజంలో బాలికలపై వేధింపులు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో వారికి ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందించేలా సర్కారు బడుల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. స్వీయరక్షణలో భాగంగా కరాటే శిక్షణలో మెలకువలు నేర్పాలని యోచిస్తోంది. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్'పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 552 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. బాలికలు అధికంగా ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కరాటే తరగతులు త్వరలో జరగనున్నాయి.

మూడునెలల శిక్షణ

బాలికలు తమని తాము రక్షించుకునేందుకు కరాటే దోహదపడుతుంది. మూడు నెలల పాటు శిక్షకుడితో వారికి తర్ఫీదు ఇవ్వనున్నారు. ఈనెల నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు అనువైన సమయాల్లో ఈ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. తరగతి బోధనకు ఆటంకం లేకుండా శిక్షణ ఇవ్వనున్నారు. మరోవైపు శిక్షకులకు ప్రతినెల రూ.5 వేల చొప్పున మూడు నెలలకుగాను ఒక్కో పాఠశాలకు రూ.15 వేలు చెల్లించేందుకు విద్యాశాఖ నిధులు విడుదల చేసింది.

కరాటేలో శిక్షణకు ఏర్పాట్లు



'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్'లో వివిధ పాఠశాలలు ఎంపికయ్యాయి. బాలికలకు కరాటేలో శిక్షకులతో శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. శిక్షణ ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయి.

– డా.ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

అన్నను గొడ్డలితో నరికి చంపిన తమ్ముడు

- నిర్మల్‌లో ఘటన
- నిందితుడి అరెస్టు, కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: సొంత అన్నను తమ్ముడు గొడ్డలితో నరికి చంపిన ఘటన జిల్లాకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తన కార్యాలయంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడలో దుర్రే శివ, దుర్రే సాంబాజి(35) అన్నదమ్ములు. వీరిద్దరి భార్యలు కాపురానికి రాకపోవడంతో వారు అమ్మ, చెల్లెలితో కలిసి నివాసం ఉంటున్నారు. సాంబాజి మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు తమ్ముడు శివతో గొడవపడేవాడు. బుధవారం అర్ధరాత్రి డబ్బులివ్వాలని శివతో గొడవపడ్డాడు. పాత గొడవలు మనసులో పెట్టుకున్న శివ ఎలాగైనా అన్నని హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. క్షణికావేశంలో గొడ్డలితో సాంబాజి తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడు శివని అరెస్టు చేశారు. సాంబాజి అక్క ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ఖానాపూర్: మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.1500 జరిమానా విధిసూ పోక్సో కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం ..ఖానాపూర్ మండలం తర్లపాడ్‌లో శ్రీసాయి ఇండస్ట్రీస్ సిమెంట్ ఇటుకల కేంద్రంలో మహారాష్ట్రకు చెందిన బాలాజీ కూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు చాంద్‌కుమార్ మరవి అక్కడే పనిచేసేవాడు. బాలాజీ కుమార్తె బాలికను చాంద్‌కుమార్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. మాయమాటలు చెప్పి మధ్యప్రదేశ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై పలుమార్లు లైంగికదాడి చేశాడు. బాలాజీ ఫిర్యాదుతో 2023లో ఖానాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.విశ్వాస్‌రెడ్డి 15 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో పోక్సో కోర్టు జడ్జి, జిల్లా ప్రధానన్యాయమూర్తి, ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జి ఏ.కర్ణకుమార్ ఈ మేరకు తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన అప్పటి ఎస్డీపీవో జీవన్‌రెడ్డి, ప్రస్తుత ఎస్డీపీవో గంగారెడ్డి, కోర్టు లైజన్ అధికారి డల్లుసింగ్, ఖానాపూర్ సీడీవో శ్రీనివాస్‌లను నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య

దండేపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. దండేపల్లి మండలం లింగాపూర్‌లో ఒకరు గడ్డిమందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన బానవత్ గణేశ్(42) గతంలో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అప్పు చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అంతేకాకుండా అతను కుటుంబీకులకు తెలియకుండా ఇతరులకు డబ్బులు ఇప్పించాడు. ఇటీవల ఆరోగ్యం సహకరించకపోవడం, పైగా అప్పుల ఒత్తిళ్లు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. బాధలు భరించలేక గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి అక్కడే గడ్డిమందు తాగి పడిపోయాడు. చిన్నకొడుకు దినేష్ పొలానికి వెళ్లి చూడగా కిందపడిపోయి నురుగులు కక్కుతు కనిపించాడు. వెంటనే గమనించి మేదరిపేటకు, అక్కడి నుంచి లక్సెట్టిపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి పెద్ద కుమారుడు వినేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జి భవనంపై నుంచి దూకి యువకుడు..


గజేందర్(ఫైల్)

బజార్‌హత్నూర్: మండలకేంద్రానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని శ్రీసాయి లాడ్జి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గువాడే మాధవ్–ఏసూబాయిల దంపతుల కుమారుడు గజేందర్ (24) హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని శ్రీసాయిలాడ్జిలో ఆరునెలలుగా వర్కర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం లాడ్జి నాలుగవ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి మాధవ్ ఫిర్యాదుతో చిక్కడపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం తర్వాత గజేందర్ మృతదేహాన్ని గురువారం గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

గడ్డెన్నవాగులో దూకి వ్యక్తి..

భైంసాటౌన్: కుభీర్ మండలం హల్దా గ్రామానికి చెందిన బత్తిని సాయినాథ్(33) గడ్డెన్నవాగు నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఏఎస్సై సుదర్శన్ కథనం ప్రకారం..సాయినాథ్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటేరి తిరిగిరాలేదు. గురువారం భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించామని, మృతుడి భార్య సంగీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉరేసుకుని వివాహిత..


తేజశ్రీ (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ రామ్‌నగర్‌కు చెందిన వివాహిత తేజశ్రీ(33) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..ఓ పెళ్లి సంబంధం విషయంలో తేజశ్రీకి భర్త రాజ్‌కుమార్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో రాజ్‌కుమార్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు తేజశ్రీని తీవ్రంగా వేధించడం మొదలుపెట్టారు. వారి వేధింపులు తాళలేక తేజశ్రీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

దాడి కేసులో ముగ్గురికి జరిమానా

లక్సెట్టిపేట: దాడి కేసులో ముగ్గురికి జరిమానా విధిస్తూ స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి గురువారం తీర్పునిచ్చారు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. 2019 ఆగస్టు 4న మోదెల గ్రామానికి చెందిన బండి లచ్చయ్య తన ఇద్దరు కుమారులు రాంచరణ్, రంజిత్ వారి ఇంటి సమీపంలో బాత్రూం నిర్మాణం చేపడుతున్నారు. స్థల హద్దు విషయమై పట్టణానికి చెందిన వేముల మధు, ఈశ్వరయ్య, రాకేశ్, వేముల రమేశ్ వారితో గొడవపడ్డారు. మాటామాట పెరగడంతో లచ్చయ్య, రాంచరణ్, రంజిత్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో అప్పటి ఎస్సై మధుసూదన్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దాడి చేసిన నలుగురిలో ఈశ్వరయ్య చనిపోవడంతో ముగ్గురిని కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువైంది. రమేశ్‌కు రూ.5వేలు, రాకేశ్‌కు రూ.5 వేలు, మధుకు రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాలలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమీర్‌శెట్టి రాజు, పట్టణ అధ్యక్షుడు బింగి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల అశోక్, జిల్లా నాయకులు మద్ది సుమన్, కొండ వెంకటేష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ముధోల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి జరుగుతున్న గణేశ్, లక్ష్మణ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యారు. ఈనెల 14 నుంచి నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

గ్రామాల్లో డీపీవో ఆకస్మిక తనిఖీ


పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కాసిపేట: మండలంలోని తాటిగూడ, కొండాపూర్, ధర్మరావుపేట గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లకు ఇరువైపుల పిచ్చిమొక్కలను పూర్తి స్థాయిలో తొలగించి నీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్ బాల్స్, బయోలార్వా, బైటెక్స్ వంటివి స్ప్రే చేయించాలన్నారు. కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా మట్టిని తొలగించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తరలించాలని తెలిపారు. పారిశుద్ధ్య పనుల్లో పంచాయతీ కార్మికులు నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఎంపీఓ సబ్దర్‌ఆలీ, ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని టీఎస్‌జీఓ సొసైటీకి కేటాయించిన ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని పలువురు రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు తులా మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ సతీశ్‌కు వినతిపత్రం అందజేశారు. కుర్షిత్ అహ్మద్‌ఖాన్, పోచయ్య, బషీర్‌అహ్మద్, డి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

280 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యం లారీతో పోలీసులు, అధికారులు

జైనథ్: మండలంలోని భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 280 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముందస్తు సమాచారంతో గురువారం పోలీసులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, జాతీయ రహదారిపై మాటు వేశారు. నిర్మల్ నుంచి మహారాష్ట్రలోని గొండియా జిల్లాకు వెళ్తున్న లారీని అనుమానంతో ఆపి తనిఖీ చేయగా దాదాపు 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్మల్‌లోని అన్నపూర్ణ రైస్‌మిల్ ట్రేడర్స్ నుంచి మహారాష్ట్రలోని గొండియా జిల్లా విలాస్ రైస్‌మిల్లుకు పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై పురుషోత్తం, డీఎస్‌ఓ వాజిద్ అలీ, ఏసీఎస్‌ఓ రాథోడ్ రవీందర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాథోడ్ రవీందర్ పాల్గొన్నారు.



కడెం: కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి చేరుకుంది. ఇరిగేషన్ అధికారులు డ్యాం సేఫ్టీ దృష్ట్యా కొద్ది రోజులుగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని 695 అడుగులు మెయింటేన్ చేస్తూ ఎగువ నుంచి వచ్చిన వరద నీటిని వరద గేట్ల ద్వారా దిగువకు వదిలారు. గురువారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి(700 అడుగులకు) చేరుకున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు వెల్లడించారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- పిప్పల్‌కోటి హత్యకేసులో ఇద్దరు అరెస్టు
- వెల్లడించిన మాండ్వి పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న మాండ్వి సీఐ గఫర్, ఎస్సై అమూల్ మాస్కే

తాంసి: వివాహేతర సంబంధం కారణంగా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి వాసి జానకొండ నారాయణ(38) హత్యకు గురయ్యాడు. మహారాష్ట్రలోని మాండ్వి పోలీసుస్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ షేక్ గఫర్, ఎస్సై అమూల్ మాస్కే వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో ఈనెల 7న ఒకరి మృతదేహం లభించింది. భీంపూర్ పోలీస్‌స్టేషన్ మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. ఇటీవల భీంపూర్ పోలీసుస్టేషన్‌లో నారాయణ మిస్సింగ్ కేసు నమోదైంది. అటవీ ప్రాంతంలో లభ్యమైన మృతదేహం గుర్తింపు కోసం మాండ్వి పోలీసులు నారాయణ కుటుంబీకులను పిలిపించారు. మృతదేహం చేతికి ఉన్న రాఖీ, కాలికి ఉన్న రాడ్డు ద్వారా తన భర్తదే అని భార్య విజయలక్ష్మి గుర్తించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పిప్పల్‌కోటిలో రెండు రోజులు విచారణ చేపట్టారు. అనుమానితులుగా అదే గ్రామానికి చెందిన మార్శెట్టి వినోద్, దేవన్నను అదుపులో తీసుకుని తమదైన శైలిలో విచారించారు. హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. మృతుడి భార్య విజయలక్ష్మితో వినోద్‌కు ఏళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. వీరి విషయం తెలుసుకున్న భర్త భార్యతో గొడవపడుతున్నాడు. తమకు అడ్డుగా ఉన్న నారాయణను అంతమొందించాలని విజయలక్ష్మి, వినోద్ పథకం పన్నారు. ఇందుకు వినోద్ మరో వ్యక్తి దేవన్న సహకారం తీసుకున్నాడు. వారిద్దరు బైక్‌పై నారాయణను ఈనెల 5న ఆదిలాబాద్ నుంచి సుంకిడి తీసుకువచ్చారు. అక్కడ నారాయణకు మద్యం తాగించారు. మహారాష్ట్రలోని పిప్పల్‌గాం గ్రామంలో మరింత మద్యం తాగించారు. తరువాత అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి నెట్టివేయడంతో బండరాళ్లపై పడిపోయాడు. వినోద్ సూచనతో దేవన్న కత్తితో నారాయణను పొడిచి హత్య చేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. పోలీసులు విచారణ చేపట్టి వినోద్, దేవన్నను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

పరీక్షలు వేగవంతం చేయాలి


టీ హబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి వచ్చే రక్తనమూనాల పరీక్షలను త్వరగా చేసి ఫలితాలు పంపించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.అనిత, ఫయాజ్, వెంకటసాయి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మంచిర్యాలటౌన్: చిన్నారులకు సరైన పౌష్టికాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజు అన్నారు. పట్టణంలోని సాయినగర్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనత, రోగ నిరోధక శక్తి పెంపుదల, పోషకాహార లోపంతో వ్యాధులు రాకుండా పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అనిత, డాక్టర్ ఫయాజ్, సీడీపీవో చందన, డాక్టర్ రాము, డాక్టర్ రజిత, ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. ఇందారం ఐకే–ఓసీపీ ప్రాజెక్టును ఆయన గురువారం సందర్శించారు. వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించాలన్నారు. గని ప్రాజెక్టు అధికారి ఏవీరెడ్డి, మేనేజర్ రవికుమార్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని ప్రీమెట్రిక్ పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రీమెట్రిక్ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో కుక్, కామాటీ, వాచ్‌మెన్,స్వీపర్, స్కావెంజర్‌లకు ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల 10లోగా వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు టి.శ్రీనివాస్, డి.అరుణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుడిహత్నూర్: మండలంలోని సీతాగొంది వద్ద జాతీయరహదారి 44పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఉట్నూర్ మండలంలోని ఏందా రాముగూడ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్, మారుతి, లేతిబాయిలు రెండు బైక్‌లపై ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్తున్నారు. వెనుక నుంచి వస్తున్న కారు రెండు బైక్‌లను ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పైలట్ ఆత్రం అశోక్, ఈఎంటీ ప్రవీణ్ వారిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. కారు డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

ఉట్నూర్ మండలంలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కుమ్మరితండా సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ఈఎంటీ శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని తాంద్ర గ్రామానికి చెందిన గేడం పున్నాజీరావు బైక్‌పై ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. కుమ్మరితండా వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీ కొనడంతో ఆయన మెడకు తీవ్రగాయమైంది. స్థానికులు అందించిన సమాచారంతో ఈఎంటీ, పైలెట్ ధరంసింగ్ అక్కడికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

స్లాబ్‌పెచ్చులు పడి ఒకరికి..

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన బొజ్జ పెద్దరాజన్న బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా స్లాబ్ పెచ్చులు కిందపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆయన్ను నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి 5 పక్కటెముకలు విరిగినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నేరడిగొండ: మండలంలోని కొర్టికల్(బి) గ్రామంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం..వినాయక నిమజ్జనం సందర్భంగా పాత కక్షలను మనస్సులో పెట్టుకుని ఒకరికొకరు దూషించుకొని గొడవపడ్డారు. కపూర్‌సింగ్, మేర్‌సింగ్‌లకు తీవ్ర గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఎస్సైతో కలిసి ఇచ్చోడ సీఐ భీమేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.